# కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దు

**ఈ నెల 30 వరకూ ఆగండి • ఎఫ్ఐఆర్‌లో ప్రాథమిక అంశాలు లోపించాయి • ప్రభుత్వ ఒప్పందాలను లోతుగా పరిశీలించాలి**

## ఫార్ములా ఈ రేసింగ్ కేసులో హైకోర్టు ఆదేశం • తదుపరి విచారణ ఈ నెల 27కు వాయిదా



'అభియోగాలకు చూపిన కారణాలు ఏమిటో చెప్పాలి. పిటిషనర్‌కు డబ్బులు ముట్టనప్పుడు అవినీతి నిరోధక చట్టం ఎలా వర్తిస్తుంది? క్రిమినల్ నెగ్లిజెన్సీ ఉందని ఎలా చెప్తారు? ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను పరిశీలించాల్సి ఉంది. కోర్టుకున్న విచక్షణాధికారంతో సీఆర్‌పీసీ 482 కింద మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నాం. కేటీఆర్‌ను ఈ నెల 30 వరకూ అరెస్టు చేయవద్దు' - హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ రేసింగ్ ఒప్పందంలో అక్రమాలు జరిగాయంటూ ఏసీబీ నమోదు చేసిన క్రిమినల్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, శాసనసభ్యుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)కు హైకోర్టులో ఊరట లభించింది. ఆ కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయరాదని ఏసీబీకి మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 30వ తేదీ వరకు అరెస్టు చేయరాదని పేర్కొంది. అయితే ఈ కేసు దర్యాప్తును కొనసాగించవచ్చని ఏసీబీకి స్పష్టం చేసింది. దర్యాప్తునకు కేటీఆర్ సహకరించాలని, తన వద్ద ఉన్న పత్రాలను ఏసీబీకి అందజేయాలని ఆదేశించింది. ఎఫ్ఐఆర్‌లో కొన్ని ప్రాథమిక అంశాలు లోపించాయని గుర్తించింది. ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను పరిశీలించాల్సి ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో కోర్టుకున్న విచక్షణాధికారంతో సీఆర్‌పీసీ 482 కింద మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు స్పష్టం చేసింది. ప్రతివాదులైన ఏసీబీ, పురపాలకశాఖ ప్రధానకార్యదర్శి ఎం దానకిశోర్‌కు నోటీసులు జారీచేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. తనపై ఏసీబీ పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసును కొట్టేయాలని కోరుతూ కేటీఆర్ శుక్రవారం అత్యవసర లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ మధ్యాహ్నం 3 గంటలకు విచారణ చేపట్టారు. 2గంటలకుపైగా ఏకబిగిన ఇరుపక్షాల వాదనలు జరిగాయి. అనంతరం మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయి.

**పిటిషనర్ (కేటీఆర్)పై సెక్షన్ 13(1)(ఏ) కింద కేసు పెట్టడానికి కారణాలేవి. చెల్లింపులకు సంబంధించిన నిబంధనలు ఒప్పందంలో ఎక్కడ ఉన్నాయి? ఫార్ములా ఈ రేసింగ్ ఒప్పందంలో అక్రమాలు జరిగితే అందుకు ఆధారాలు ఏవి? నగదు చెల్లింపులు పిటిషనర్‌కు చేయలేదు కదా?**

**- అడ్వకేట్ జనరల్‌కు హైకోర్టు ప్రశ్నలు**

### రాజకీయ.వ్యక్తిగత కక్ష సాధింపు

కేటీఆర్ తరపున సీనియర్ న్యాయవాది సీఏ సుందరం వాదనలు వినిపిస్తూ.. కేటీఆర్‌పై కేసు నమోదు చేయడం రాజకీయ విభేదాలతోపాటు వ్యక్తిగత కక్షసాధింపు చర్యగా అభివర్ణించారు. కేటీఆర్‌పై కేసు నమోదు చేయడానికి ఎలాంటి కారణాలు లేవన్నారు. ఎఫ్ఐఆర్‌ను పరిశీలిస్తే అవినీతి జరిగినట్టు ఎక్కడా ఆధారాలు ఉండవని తెలిపారు. పిటిషనర్ ఆర్థిక ప్రయోజనం పొందినట్టు ఎలాంటి ఆరోపణలు లేవని తెలిపారు. ఫార్ములా రేస్ నిమిత్తం ప్రభుత్వం, ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ), ఏస్ నెక్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరిందని వివరించారు. ఇందులో 10వ సీజన్‌కు ప్రమోటర్ వెళ్లిపోవడంతో ప్రభుత్వమే చెల్లింపులు జరిపి రేస్ నిర్వహణకు ఆమోదం తెలిపిందని, 2023 బకాయిలను చెల్లించిందని వివరించారు. కొత్తగా చేసుకున్న ఒప్పందాన్ని ప్రభు త్వం అమలు చేయక ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో అర్బిట్రేషన్‌ను ఎదుర్కోవాల్సి వస్తున్నదని తెలిపారు.

### ఆలస్యంగా ఎందుకు కేసు పెట్టారు?

ఈ కేసులో ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగినట్టు చెప్తున్నారని, అలా జరిగి ఉంటే ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని న్యాయవాది సుందరం తెలిపారు. ఈసీ స్పందించకపోయినా ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగా కేసు నమోదు చేసిందని చెప్పారు. ఈసీ ప్రొసీజర్ అమలు చేయలేదన్న ఆరోపణ మీద 14 నెలలు ఆలస్యంగా ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. ఇది సుప్రీంకోర్టు తీర్పులకు, మార్గదర్శకాలకు వ్యతిరేకమన్నారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 3(1)(ఏ) కింద కేసు నమోదు చేయడానికి నిధుల దుర్వినియోగం ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు, నిజంగానే అవినీతి జరిగితే ప్రమోటర్స్‌ను ఎందుకు నిందితులుగా చేయలేదని నిలదీశారు.

### ప్రభుత్వ విధాన నిర్ణయం

ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నది ప్రభుత్వమని, అధికార యంత్రాంగం అన్నీ చూసిన తరువాత మంత్రిగా కేటీఆర్ ఆమోదం తెలిపారని చెప్పా రు. ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయంలో తప్పు జరిగితే దానిపై ప్రభుత్వమే తిరిగి నిర్ణయం తీసుకోవాలని వివరించారు. ఇక్కడ నిర్వాహకులను నిందితులుగా ఎందుకు చేర్చలేదో హైకోర్టు లోతుగా పరిశీలించాలని కోరారు. ఈ ఒక్క కోణం పరిశీలించినా కేసు కుట్రపూరితమని స్పష్టం అవుతుందని తెలిపారు. ఇది కేవలం సివిల్ వివాదమని, ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాల్సిన కేసు అని, ప్రత్యర్థులు కౌంటరు దాఖలు చేశాక విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని, ఎఫ్ఐఆర్‌పై తదుపరి ప్రొసీడింగ్స్‌ను నిలిపివేస్తూ స్టే ఇవ్వాలని కోరారు.

### ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ చెల్లదు

ఫార్ములా ఈ రేసింగ్‌కు జరిగిన ఒప్పందంలో నగదు చెల్లింపుల షరతులపై కోర్టు అడ్వకేట్ జనరల్ (ఏజీ)ని ప్రశ్నించింది. అభియోగాలకు చూపిన కారణాలు ఏమిటో చెప్పాలని నిలదీసింది. పిటిషనర్‌కు డబ్బులు ముట్టనప్పుడు అవినీతి నిరోధక చట్టం ఎలా వర్తిస్తుందని ప్రశ్నించింది. క్రిమినల్ నెగ్లిజెన్సీ ఉందని ఎలా చెప్తారని అడిగింది. వీటిపై ఏజీ ఏ సుదర్శన్‌రెడ్డి నుంచి నేరుగా జవాబులు రాలేదు. అవన్నీ ఏసీబీ దర్యాప్తులో తేలుతాయని, ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని మాత్రం కోరారు. దీనిపై కేటీఆర్ న్యాయవాది సుందరం కల్పించుకుంటూ.. ఈ నెల 18న ఏసీబీకి ఫిర్యాదు అందితే దానిపై ఆగమేఘాల మీద ఆ మరుసటి రోజే ఈ నెల 19న ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని చెప్పారు. భజన్‌లాల్, లలిత్‌కుమారి కేసుల్లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుల ప్రకారం ఫిర్యాదు ఆలస్యంగా అందితే దానిపై దర్యాప్తు అధికారి ప్రాథమిక విచారణ చేశాకే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని గుర్తుచేశారు. దీనిపై ఏజీ స్పందిస్తూ, గతంలోనే ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం గుర్తించిందని, కేటీఆర్‌పై దర్యాప్తునకు గవర్నర్ నుంచి అనుమతి తీసుకున్నట్టు వివరించారు. గవర్నర్ ఈ నెల 17న అనుమతి ఇచ్చారని, ఆ మరుసటి రోజు పురపాలక శాఖ ప్రధా న కార్యదర్శి ఎం దానకిషోర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారని తెలిపారు.

### మోసం చేశారనే అభియోగాలకు ఆధారాలు లేవు

మోసపూరితంగా ప్రభుత్వ ఆస్తిని దుర్వినియోగం చేశారనే ఆరోపణలకు ఆధారాలు లేవని సుందరం చెప్పారు. కాబట్టి అవినీతి నిరోధక చట్టం, 1988లోని సెక్షన్ 13(1)(ఏ), సెక్షన్ 13(2) పిటిషనర్ కేటీఆర్‌కు వర్తించవని అన్నారు. ఐపీసీలోని 120-బి, 409 సెక్షన్ల కింద కేసు నమోదు వెనుక కుట్ర ఉన్నదని చెప్పారు. ఇలాంటి తీవ్ర నేరాభియోగాలతో కేసు నమోదు చేస్తే 41 (ఏ) నోటీసు ఇచ్చి పిటిషనర్‌ను విచారణ చేయాల్సిన అవసరం లేకుండా కుట్రపూరితంగా చేశారని తెలిపారు. రాజకీయ కుట్రతో పిటిషనర్‌ను జైల్లో పెట్టాలనే కుయుక్తి ఉందని అన్నారు.

### లోపాలుంటే అది ప్రభుత్వానివే..

ప్రభుత్వం ఒకసారి ఒప్పందం చేసుకున్నాక రెండోసారి నిర్వాహకులతో మరో ఒప్పందం చేసుకుందని సుందరం వివరించారు. ఇందులో లోటుపాట్లు ఉంటే అది ప్రభుత్వపరమైనవే తప్ప పిటిషనర్‌వి కాబోవని అన్నారు. రెండోసారి ఒప్పందం చేసుకున్నప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉందని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. తొలి ఒప్పందం మేరకే రెండో ఒప్పందం అమలు అయ్యింది కాబట్టి ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగలేదని చెప్పారు. ఈసీ విషయాలను ప్రభుత్వం చెప్పడం ఏమిటని ప్రశ్నించారు.

### 14 నెలలు ఆలస్యంగా కేసు చెల్లదు

**ప్రాథమిక** విచారణ కూడా లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని సుందరం అన్నారు. కేవలం ప్రత్యర్థి పార్టీ నేతగా ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తున్న కారణంగానే కేటీఆర్‌పై లేనిపోని అభియోగాలతో కేసు నమోదు చేశారని చెప్పారు. పీసీ యాక్ట్‌లోని 13(1)ఏ ప్రకారం చట్టసభ ప్రతినిధి నిధుల దుర్వినియోగం అభియోగాలు ఉంటేనే కేసు నమోదు చేయాలని తెలిపారు. స్పాన్సర్లు వెళ్లిపోయారని, నిర్వహకులూ వెళ్లిపోయేలా ప్రభుత్వం చేసిందని, ఇక్కడ డబ్బులు తీసుకున్న నిర్వాహకులపై కేసు పెట్టకుండా నాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేయడం చట్ట వ్యతిరేకమని అన్నారు.

## ఫార్ములా ఈ రేస్‌పై చర్చించే దమ్ము లేదా?

- **కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర కేసు పెట్టారు**
- **సమాధానం చెప్పడానికి మేం రెడీ: జగదీశ్‌రెడ్డి**
- **హామీలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలి: తలసాని**
- **కుట్రతో కేసులు పెడితే నడవదు: ప్రశాంత్‌రెడ్డి**



హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ప్రజా సమస్యలను, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను పక్కదోవ పట్టించేందుకే బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఈ కార్ రేసింగ్‌పై శాసనసభలో చర్చించాలని కేటీఆర్ డిమాండ్ చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పారిపోతున్నదని ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతు భరోసా, మహిళా సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కొండను తవ్వి ఎలుకను పట్టలేదని ఎద్దేవా చేశారు.

### డాక్టర్లతో టెస్టులు చేయండి: తలసాని



సభకు ఎవరు తాగి వచ్చారో ప్రభుత్వ డాక్టర్లను పిలిపించి టెస్టులు చేయించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సవాల్ విసిరారు. ఏడాదిలో చేసిందేమీ లేక, చెప్పడానికేమీ లేక మీద ఎలా పడితే అలా ఎలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ రేసింగ్ మీద చర్చ పెట్టాలని కోరితే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పేపర్లు, బాటిల్స్ విసిరారని తెలిపారు.

### ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం: ప్రశాంత్‌రెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయలేక ప్రశ్నించినవాళ్లపై తప్పుడు కేసులు పెడుతున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం చేస్తున్న అవినీతిని బయటపెడుతున్నందుకే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కుట్రతో కేసులు పెడితే నడవబోదని హెచ్చరించారు.

## రేవంత్, బీజేపీ జోడీ.. కేటీఆర్‌పైకి ఈడీ

- **ఏసీబీ రాకముందే ఈసీఐఆర్ నమోదు**
- **రేవంత్‌కు రాహుల్ నో ఎంట్రీ.. కేంద్ర మంత్రుల ఫ్రీ ఎంట్రీ**
- **కేటీఆర్‌ను, బీఆర్ఎస్‌ను ఇబ్బందిపెట్టేందు కుట్ర!**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విషయంలో వాయువేగంగా జరుగుతున్న తాజా పరిణామాలు బీజేపీతో రేవంత్ రెడ్డి కుమ్మక్కు రాజకీయాలను బట్టబయలు చేస్తున్నాయి. ఆ జోడీ బంధానికి ఈడీ దూకుడే సాక్షమని స్పష్టమవుతున్నది. ఫార్ములా ఈ-రేస్‌లో కేటీఆర్‌పై గురువారం సాయంత్రం ఏసీబీ కేసు నమోదు చేసిన కొద్ది గంటల్లోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సైతం కేసు నమోదు చేయడం ఇందుకు బలం చేకూరుస్తున్నది. ఫార్ములా ఈ-రేస్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీలు బ్యాంక్ టు బ్యాంక్ జరిగాయని, ఇందులో అవినీతికి ఆస్కారమే లేదని, అవినీతే లేనప్పుడు ఏసీబీ విచారణ ఎందుకని, అసలు ఏసీబీ కేసు నిలుస్తుందా? అని ఓవైపు వాదనలు కొనసాగుతున్నాయి. మరోవైపు కేసులో అవినీతి కోణం ఉన్నదా? లేదా? అన్న విషయాన్ని న్యాయస్థానం తేల్చాల్సి ఉన్నది. కేటీఆర్‌పై నమోదైన కేసులో ఏసీబీ ప్రాథకమి విచారణ ప్రారంభించకముందే ఢిల్లీ నుంచి ఆగమేఘాల మీద ఈడీ రంగ ప్రవేశం చేయటం అనేక అనుమానాలకు తావిస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీతో కుమ్మక్కు కారణంగానే కొన్ని గంటల్లోనే ఈడీ రంగంలోకి దిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కేటీఆర్‌ను తద్వారా బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలనే వ్యూహంతోనే రేవంత్‌కు కేంద్రంలోని బీజేపీ అండగా నిలిచిందన్న విమర్శలు వస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వటంలేదనేది పలుసార్లు స్పష్టమైంది. అదే సమయంలో కేంద్రమంత్రులను మాత్రం రేవంత్‌రెడ్డి అలవోకగా కలిశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి ఆశ్రిత పక్షపాతం చూపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ చేసిన ఫిర్యాదులను కేంద్రం బుట్టదాఖలు చేస్తూ వస్తున్నది.

# ఏసీబీ ఎఫ్ఐఆర్.. ఈడీ తయ్యార్!

మొదటిపేజీ తరువాయి...

మరికొందరిపై కేసు నమోదుచేసింది. కేటీఆర్‌పై నమోదుచేసిన ఎఫ్ఐఆర్, ఇతర డాక్యుమెంట్లు ఇవ్వాలని హైదరాబాద్ ఈడీ అధికారులు ఏసీబీ డీజీకి లేఖ రాశారు. కేటీఆర్‌పై తెలంగాణ ఏసీబీ నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకొన్న ఈడీ హవాలా చట్టంలోని వివిధ సెక్షన్ల కింద 'ది ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్)'ను నమోదు చేసింది. ఏసీబీ నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌లోని నిందితుల వరుస క్రమాన్నే ఈడీ కూడా తన కేసులో నమోదు చేసింది. ఏ1గా కేటీఆర్ ఉండగా, ఏ2గా ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా రిటైర్డ్ అధికారి బీఎల్ఎన్ రెడ్డి ఉన్నారు. ఈసీఐఆర్ ఆధారంగా మొదట హవాలా చట్టం కింద కేసు దర్యాప్తు ప్రారంభిస్తామని ఈడీ అధికారులు తెలిపారు. దీంతోపాటు 'ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) కింద ఎలాంటి ఉల్లంఘనలు జరిగాయో అన్వేషిస్తామని వెల్లడించారు. ఈ కేసులో విదేశీ కంపెనీకి నిధులు వెళ్లడంతో.. ఫెమా యాక్ట్ వర్తింపుపైనే ఈడీ దృష్టిపెట్టినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ క్రమంలో ఏసీబీ డీజీ విజయ్‌కుమార్‌కు ఈడీ హైదరాబాద్ జోన్ జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్ లేఖ రాశారు. నిరుడు ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో జరిగిన రేస్‌కు సంబంధించిన ఆర్థిక అవకతవకలపై మాజీ మంత్రి కేటీఆర్, ఇతరులపై గురువారం ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఏసీబీ కేసులతో రాష్ట్రమంతా చర్చనీయాంశంగా మారిన ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలోకి.. ఈడీ కూడా ప్రవేశించడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గురువారమే ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేయగా.. శుక్రవారమే ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేయడం అనుమానాలకు దారి తీస్తున్నది.

### కేటీఆర్‌కు త్వరలో నోటీసులు..

**ఫార్ములా** ఈ-కార్ రేస్‌పై ఇప్పటికే ఈసీఐఆర్ నమోదు చేసిన ఈడీ అధికారులు.. కేటీఆర్‌ను విచారించేందుకు త్వరలోనే నోటీసులు ఇస్తారని సమాచారం. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించిన పూర్వాపరాలను పరిశీలించిన ఈడీ అధికారులు.. అందుకు సంబంధించిన ప్రశ్నలను కూడా సిద్ధం చేసుకుంటున్నట్టు తెలిసింది. అయితే, తమ విచారణలో మనీలాండరింగ్, ఫెమా ఉల్లంఘనలపైనే దృష్టి పెట్టిన ఈడీ అధికారులు వివరాలు రాబట్టేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కాగా, మంత్రి హోదాలో తానే డబ్బులు ఇవ్వమని చెప్పినట్టు కేటీఆర్ అంటుండగా.. డబ్బులు ముట్టినట్టు నిర్వహణ కంపెనీ వెల్లడించిన నేపథ్యంలో ఎక్కడ అవినీతి జరిగిందని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.

### చీకటి దోస్తానా బట్టబయలు

కాంగ్రెస్- బీజేపీ చీకటి దోస్తానా మరోసారి బట్టబయలైంది. ఈ రెండు పార్టీలు చీకట్లో షేక్‌హాండిచ్చుకుని పచ్చిగా సహకరించుకుంటున్న వైనం కళ్లకు కడుతున్నది. కేటీఆర్ మీద ఈడీ కేసు దాన్నే ధ్రువపరుస్తున్నది. అపుడెపుడో హుజూరాబాద్ ఎన్నికల్లో నామ్‌కే వాస్తే అభ్యర్థిని నిలపడం నుంచి మొదలైన బీజేపీ -కాంగ్రెస్ చీకటి సంసారం అసెంబ్లీ ఎన్నికల్లో పరస్పర సహకారం, పార్లమెంటు ఎన్నికల్లో సగం సగం సీట్ల సర్దుబాటుతో పరాకాష్ఠకు చేరింది. జాతీయ స్థాయిలో మోదీ- రాహుల్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. పార్లమెంటు ఆవరణలో రెండుపార్టీలు పరస్పరం భౌతికదాడులకు దిగుతున్నాయి. మరి రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు మీద బీజేపీ వైఖరి ఎలా ఉండాలి? బెంగాల్‌లో ఎలా ఉంది? కర్ణాటకలో ఎలా ఉంది? అక్కడ వీధుల్లో విధ్వంసాలు సష్టిస్తున్న బీజేపీ తెలంగాణలో రేవంత్ సర్కారు మీద ఎందుకు మౌనం పాటిస్తున్నది? రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచింది. గత ఏడాది కాలంలో ఈ ప్రభుత్వం మీద బీజేపీ ఏ ఒక్క అంశంలోనైనా పోరాడిందా? ఆరు గ్యారెంటీల అమలుకు బీజేపీ ఏనాడన్నా డిమాండ్ చేసిందా? కేసీఆర్ హయాంలో రెచ్చిపోయిన సర్జికల్ స్ట్రైకు వీరులు ఏమైపోయారు? అప్పటి వీధి పోరాటాలేమయ్యాయి? గురుకులాల్లో పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నా.. పట్టించుకోరు. ఆటోడ్రైవర్లు ఆత్మహత్యల బాట పడుతున్నారు. కన్నెత్తి కూడా చూడరు. చేనేతన్నలు ఉరికంబాలకు వేలాడుతున్నారు. ఆ వైపుకే వెళ్లరు. దవాఖానల్లో మందులు లేవు. విద్యార్థులకు రీఇంబర్స్‌మెంటు లేదు. యువతకు ఉద్యోగ క్యాలెండరూ లేదు. రైతుబంధు అతీ గతీ లేదు. రుణమాఫీ గుణకారాలు బాగాహారాల్లో గణాంకాల గందరగోళమైంది. ధాన్యం కొనేవారు లేక ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నది. రియల్ ఎస్టేట్ పాతాళానికి జారిపోయింది. హైదరాబాద్ ప్రతిష్ఠ అధోగతి పాలైంది. అయినా సరే.. ఏ ఒక్క బీజేపీ నాయకుడు మాట్లాడడు. టీవీలో హరికథలు చెప్పే లఘువులు మౌనవ్రతం దాల్చారు. దొంగలు పడ్డ ఆర్నెల్లకు.. అన్న చందంగా అంతా కూల్చేశాక.. మూసీ నిద్రల నాటకాలు ఆడతారు తప్ప మళ్లీ ఆ వైపు వెళ్లరు. లగచర్ల ఉదంతంలో రైతులు జైలు పాలైనా పట్టించుకోరు. ఏతావాతా గత 12 నెలల రాష్ట్ర బీజేపీ రాజకీయ ప్రోగ్రెస్ కార్డు రిపోర్ట్ ఏమిటంటే సున్నా బై సున్నా! బీఆర్ఎస్ హయాంలో కేంద్రంనుంచి వారానికో నాయకుడు పర్యటించి ప్రభుత్వం మీద బురద చల్లేవారు. ఇప్పుడు ఒక్క నాయకుడూ ఇటువైపు రావడం లేదు? ప్రభుత్వాన్ని కడిగేయడం లేదు? కాంగ్రెస్ మీద పోరాడకుండా బీజేపీని ఏ శక్తి ఆపుతున్నది? ఆ శక్తికి ఒనగూరుతున్న ప్రయోజనాలు ఏమిటి? బీజేపీ మౌనం వెనుక మతలబు ఏమిటి?

### ఈడీ.. ఎందుకింత హడావుడి?

*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అవినీతి లేదు. అక్రమం జరగనే లేదు. నిధుల దుర్వినియోగం అసలే లేదు. ఐతేనేమి.. ఫార్ములా ఈ-కారు రేసులో ఏదో జరిగిపోయిందంటూ కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. ఆ వెంటనే మరో పనిలేనట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా రంగంలోకి దిగింది. ఏసీబీ కేసు నమోదై 24 గంటలు గడువకముందే ఆగమేఘాలపై వాలిపోయిన ఈడీ అధికారులు.. శుక్రవారం రాత్రి ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్, నాటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, అప్పటి హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిపై మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసినట్టు ఈడీ అధికారులు తెలిపారు.*

**ఏసీబీ ఎఫ్ఐఆర్‌ను ఫాలో అవుతూ..**

*ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగానే ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసినట్టు తెలిసింది. అసలు ఏసీబీ ఎఫ్ఐఆర్‌లోనే ఎన్నో అర్థంకాని ప్రశ్నలు ఉత్పన్నమైనప్పుడు దాన్ని ఆధారంగా చేసుకొని ఈడీ మరో కేసు ఎలా నమోదు చేసిందన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్ములా-ఈ రేసు నిర్వహించింది. అందుకు రూ.55 కోట్లను హైదరాబాద్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఖాతా నుంచి బ్రిటన్‌లోని ఫార్ములా-ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఈవో) సంస్థ బ్యాంకు ఖాతాకు పంపారు. ఈ నగదు ముట్టినట్టు రేసు నిర్వహణను పర్యవేక్షించిన ఫెడరేషన్ ఆఫ్ మోటర్ స్పోర్ట్స్ క్లబ్ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఎస్‌సీఐ) కూడా వెల్లడించింది. విధానపరమైన లోపాలు జరిగాయే గానీ, అవినీతి జరుగలేదని కేటీఆర్ చెప్పారు. బ్యాంకు ఖాతా నుంచి మరో ఖాతాకు నగదు లావాదేవీ జరిగింది. ఒక్కరూ పాయి పక్కదారి పట్టలేదు. అవినీతి ఎక్కడున్నదని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఇవే మీ పట్టించుకోని ఏసీబీ.. గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు నమోదు చే యడం కుట్రే నన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.*

# పొంగులేటిని వదిలి.. కేటీఆర్‌పై దాడి

- **అక్టోబర్‌లో రెండు రోజులపాటు మంత్రి ఇంట్లో ఈడీ సోదాలు**
- **నగదు కౌంటింగ్ మెషిన్లు తీసుకెళ్లిన అధికారులు**
- **80 రోజులు దాటినా చిన్న ప్రకటన కూడా చేయని ఈడీ**
- **'ఫార్ములా-ఈ'లో మాత్రం ఫిర్యాదు చేయకున్నా కేసు నమోదు**



**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో సెప్టెంబర్ 27,28 తేదీల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. 83 రోజులు గడిచినా ఇప్పటివరకు కేసు నమోదైనట్టు ఈడీ నుంచి ప్రకటన రాలేదు.**

**ఫార్ములా-ఈ రేసులో కేటీఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీకి ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే ఈడీ సుమోటోగా తీసుకొని, కేసు నమోదు చేసింది.**

**మరి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఒక న్యాయం.. కేటీఆర్‌కు ఒక న్యాయమా?**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఫార్ములా-ఈ రేసు కేసులో ఏసీబీ కేసు నమోదు చేసిన 24 గంటల్లోనే ఈడీ రంగంలోకి దిగడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతున్నది. ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా, సుమోటోగా తీసుకొని స్వయంగా ఏసీబీ అధికారులను అడిగి వివరాలు సేకరించి, కేసు నమోదు చేయడం పట్ల నిపుణులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో వెలుగు చూసిన కుంభకోణాలు, అవినీతి ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలు స్వయంగా ఫిర్యాదు చేసినా, ఈడీ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసినా పట్టించుకోని అధికారులు కేటీఆర్‌పై కేసు నమోదు చేసేందుకు మాత్రం ఉత్సాహం చూపడం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఘటనను ఎత్తి చూపుతూ ఈడీ ద్వంద్వ వైఖరిపై మండిపడుతున్నారు.

### పొంగులేటికి ఒక న్యాయం..

ఈ ఏడాది సెప్టెంబర్ 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి నివాసం, కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. జూబ్లీహిల్స్, హిమాయత్‌సాగర్‌లో జరిగిన ఈ సోదాల్లో పెద్దఎత్తున నగదు దొరికిందన్న ఆరోపణలు వినిపించాయి. అధికారులు మూడు నగదు కౌంటింగ్ మెషిన్లను తీసుకెళ్లడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. సాధారణంగా ఈడీ అధికారులు ఎక్కడ సోదాలు జరిపినా ఒకటి రెండు రోజుల్లో అధికారిక ప్రకటన విడుదల చేస్తుంటారు. ఇప్పటివరకు 83 రోజులు జరిగినా ఒక్క ప్రకటన కూడా విడుదల కాలేదు. పైగా ఈడీ దాడులకు ముందే సీపీయూలు, హార్డ్‌డిస్కులు, ఇతర కీలక పత్రాలను తరలించారని ఆరోపణలు వచ్చినా.. ఆ దిశగా ఈడీ దృష్టిసారించలేదు. మంత్రి పొంగులేటి కూడా తనపై ఈడీ దాడులు జరిగినప్పుడల్లా సాయంత్రం ప్రెస్‌మీట్ పెట్టి మరీ వివరాలు వెల్లడిస్తుంటారు. కానీ ఈసారి మాత్రం ఆయన కూడా గప్‌చుప్‌గా ఉన్నారు.

### ఇవెందుకు సుమోటోగా తీసుకోలేదు?

కేటీఆర్‌పై నమోదైన కేసును సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేసిన ఈడీ.. రాష్ట్ర ప్రభుత్వంపై వచ్చిన ఇతర ఆరోపణల్లో సొంతంగా ఎందుకు విచారణ ప్రారంభించడం లేదని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. పౌరసరఫరాల శాఖలో రూ.1100 కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ ఆరోపించింది. 35 లక్షల టన్నుల ధాన్యాన్ని ఖాళీ చేసే గ్లోబల్ టెండర్లలో రూ.750 కోట్లు, మిల్లర్ల దగ్గర నుంచి బియ్యం కొనుగోళ్ల రూపంలో మరో రూ.300 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించింది. ఇది మనీలాండరింగ్ అని, ఈడీ విచారణ జరపాలని కేటీఆర్ పలుమార్లు డిమాండ్ చేశారు. అయినా ఈడీ సుమోటోగా కేసు నమోదు చేయలేదు. అమృత్ స్కీం టెండర్ల పనుల్లో కుంభకోణం జరిగిందని, అర్హతలేని కంపెనీకి రూ.1137 కోట్ల పనులు కట్టబెట్టారని కేటీఆర్ ఆధారాలతో సహా మీడియాకు వివరించారు. ఈ ఘటనలో కేంద్ర ప్రభుత్వం, ఈడీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అయినా ఈడీ సుమోటోగా ఎందుకు కేసు నమోదు చేయలేదని, విచారణ జరపడం లేదని ప్రశ్నిస్తున్నారు. దీనిని బట్టి కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈడీ కేసు నమోదు చేసిందని విమర్శిస్తున్నారు.

### కేటీఆర్‌కు మరో న్యాయం..

**రాష్ట్రంలో** ఫార్ములా-ఈ నిర్వహణకు హెచ్ఎండీఏ నుంచి రూ.55 కోట్లు విడుదల చేసిన ఘటనలో పురపాలక శాఖ కార్యదర్శి దానకిశోర్ గురువారం ఏసీబీకి ఫిర్యాదు చేశారు. అంతే.. శుక్రవారం ఈడీ రంగంలోకి దిగింది. ఎవరూ ఫిర్యాదు చేయకున్నా సుమోటోగా తీసుకొని వివరాలు తీసుకొని, కేసు నమోదు చేసింది.

# బ్రాండ్ ఇమేజ్ బర్బాద్

- **ఈ-రేస్‌పై సీఎం అబద్ధాల ప్రచారం**
- **ఫార్ములా ఈ-రేస్ నిర్వహణకు డబ్బులు ఇవ్వాలని తెలియదట!**
- **ఎఫ్ఈవో ప్రతినిధి చెప్పాకే తెలిసిందని సీఎం వాఖ్యలు**



హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : ఫార్ములా ఈ-రేస్‌పై శుక్రవారం శాసనసభలో సీఎం మాట్లాడిన తీరు తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. సాక్షాత్తూ ప్రభుత్వమే ఎఫ్ఈవోతో ఒప్పందం చేసుకున్నా, దీనికి సంబంధించిన వివరాలన్నీ ఇదివరకే మీడియాలో వచ్చినా తనకు ఎఫ్ఈఓ ప్రతినిధి చెప్పేదాకా ఏమీ తెలియదని ముఖ్యమంత్రి పేర్కొనడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రతిష్ఠాత్మకమైన ఈవెంట్‌ను నిర్వహించి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచవ్యాప్తంగా అనుమడింపజేసేలా చేసిన కార్యక్రమంపై సీఎం కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

**సీఎం:** బీఏసీలో బీఆర్ఎస్ ఇచ్చిన 9 అంశాల్లో ఫార్ములా-ఈ అంశం లేదు. ఇప్పుడు చర్చించాలని పట్టుబడుతున్నారు.

**వాస్తవం:** బీఏసీ సమావేశం నాటికి ప్రభు త్వం ఈ అంశాన్ని ప్రస్తావించలేదు. ఫార్ములా ఈరేస్‌పై ప్రభుత్వం గురువారం కేసు నమోదు చేసింది. అసెంబ్లీలో వాస్తవాలు వెల్లడించేందుకు చర్చకు బీఆర్ఎస్ పట్టుబడుతున్నది.

**సీఎం:** ఎఫ్ఈవో (ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్) ప్రతినిధి వచ్చి మాకు కేటీఆర్‌తో వ్యవహారం ఉన్నది. రూ.600 కోట్లు ఇవ్వాలని కోరాడు. ఇందులో లోపాయికారి ఒప్పందం గురించి చెప్పాడు. ప్రజల సొమ్ము ప్రజలకే చెందాలని చెప్పిన. ఆయన చెప్పినప్పుడే అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నా. విచారణ చేయాలని చెప్పిన.

**వాస్తవం :** 2023 ఫిబ్రవరిలోనే హైదరాబాద్‌లో ఈ-రేస్ నిర్వహించారు. దీన్ని దేశ విదేశాలకు చెందిన అనేకమంది ప్రముఖులు వీక్షించారు. దీనికి కొనసాగింపుగా వచ్చే ఏడాది కూడా రేస్ ఉంటుందని నాడే ప్రకటించారు. ప్రస్తుత సీఎం అప్పుడు మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్నారు. ప్రపంచానికి తెలిసిన విషయం ఎఫ్ఈవో ప్రతినిధి వచ్చి తనకు చెప్పేవరకు తెలియదనడం విస్తుగొలుపుతున్నది. ఒప్పందం ప్రకారమే ప్రభుత్వం వారికి రూ.55 కోట్లు చెల్లించినట్టు స్వయంగా కేటీఆర్ ప్రకటించారు. ప్రభుత్వమే వారికి చెల్లించినట్టు ఆధారాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం చెల్లించకపోవడంతో ఒప్పందాన్ని రద్దుచేసుకున్నట్టు ఎఫ్ఈవో ప్రకటించింది. వ్యవహారం అర్బిట్రేషన్‌లో ఉన్నది. ఈ విషయం స్థానిక, జాతీయ మీడియాలోనూ వచ్చింది. అయినా ఆయన చెప్పేదాకా తనకు తెలియదనడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఫార్ములా ఈ రేస్ వల్ల హైదరాబాద్ నగరం టోక్యో, షాంఘై, బెర్లిన్, మొనాకో, లండన్ వంటి టాప్-25 నగరాల సరసన హైదరాబాద్ చేరింది. నగర ప్రతిష్ఠ ప్రపంచవ్యాప్తంగా పెరిగింది. ఈ-రేస్ తర్వాత తెలంగాణకు రూ.700 కోట్ల మేర ఆర్థిక లబ్ధి కలిగినట్టు నిల్సన్ స్పోర్ట్స్ అనాలసిస్ సంస్థ వెల్లడించింది. ఆతిథ్య నగరంగా హైదరాబాద్ పరపతి పెరిగినట్టు సదరు సంస్థ తెలిపింది. ప్రజల సొమ్ము ప్రజలకే చెందాలంటే నగరానికి జరిగిన ఈ మేలు ప్రజాప్రయోజనం కాదా? అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

**సీఎం:** ఎంఏయూడీ, పోలీసు శాఖ నా దగ్గరే ఉన్నాయి. కేటీఆర్ కోర్టును ఆశ్రయించారు. కోర్టులో వాదనలు జరుగుతున్నాయి కాబట్టి ఇప్పుడు వివరాలు వెల్లడించడం సరికాదు. కోర్టులో పరిస్థితి అంచనా వేశాక సభలో అయినా, ఎక్కడైనా, చివరికి వాళ్ల పార్టీ ఆఫీసులో అయినా చర్చించేందుకు వస్తా. అన్నీ తర్వాత వివరిస్తా.

**వాస్తవం:** హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఫార్ములా ఈ-రేస్‌ను ప్రభుత్వం నిర్వహించింది. ఇందులో భాగంగానే ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఎస్‌సీఐ)కు రూ.55 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. ఈ విషయాలన్నీ గతంలో కేటీఆర్ వివరించారు. దాస్తున్నదేమీ లేదని తాజాగా ప్రకటించారు. అయినా ఇందులో ఏదో మతలబు ఉన్నట్టు సీఎం చెప్పడంలో ఆంతర్యమేమిటనేది అర్థం కావడంలేదు.